"ఎందుకు ఈ పాడుపని?" అడిగాను అసహ్యంగా.

నాభార్య కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నా దగ్గరికి వచ్చి నా గుండెల మీద తలవాల్చి చెప్పింది.

"సారీ అండి, నా కాఫీ బావుందని వాళ్ళంతా వస్తుంటే, మీ సంపాదన మన పాల ఖర్చుకి సరిపోవటం లేదని మీకు చెప్పటం ఇష్టంలేక. మీకు మీ స్నేహితులంటే ఎంత ఇష్టమో నాకు తెలుసు అందుకని వాళ్ళు చూసేలా ఎంగిలిచేసి ఇస్తున్నాను ఇంకెప్పుడూ రారని"

నేను నా భార్య గడ్డం పట్టుకుని తలెత్తి ఆమె కళ్ళలోకి చూశాను.

పల్లెటూరి పిల్లలో వుండే అమాయకత్వం కనిపించింది నాకు వాటిలో. కళ్ళ నీళ్ళు తుడిచి చెప్పాను.

"తప్పు కదా?"

"మా అమ్మే చెప్పిందండి ఈ వుపాయం. పెళ్ళయి సిటీలో వుండే మా వూరి అమ్మాయిలంతా డబ్బు చాలకపోతే ఇలా చేస్తారని వుత్తరము రాసింది."

రాహుల్‌కి జరిగింది చెప్పి, నా మిత్రులు ఎప్పటిలా నా ఇంటికి కాఫీకి వస్తుంటేనే వాళ్ళు నన్ను క్షమించినట్లు అని చెప్పాను. ఇది జరిగి ఎనిమిదేళ్ళయినా, ఇప్పుడు నేను వైజాగ్‌కి బదిలీ అయిపోయినా నా కలకత్తా మిత్రులు ఈ సంఘటన ఇంకా మర్చిపోలేదు.

# భార్య

అర్ధరాత్రి ఫోన్ మోగితే విసుక్కుంటూ అందుకుని "హలో" అన్నాను.

శివలీల

"మీ ఫ్రెండ్ పోయారు. ఓసారి వస్తారా?"

శివలీల కంఠాన్నిబట్టి గురునాధ్ చచ్చిపోయారని అర్ధమయిందినాకు.

* * * *

అవసరానికి మించిన డబ్బు ఉండటంవల్ల తరచు నష్టమే అధికంగా జరుగుతోంటుందన్న విషయానికే వుదాహరణ గురునాథ్.

ఆయన వయసు నలభై అయిదు నిండింది. హైదరాబాద్‌లో పేపర్ బట్టలు, టపాకాయలు మొదలయిన వాటికి డిస్ట్రిబ్యూటర్. ఓ ఆఫ్‌సెట్ ప్రెస్‌కూడా ఈ మధ్యే కొన్నాడు. అది నష్టంలో నడుస్తుంటే.

అవసరానికి మించిన సంపాదన వుంటే నిజమైన వ్యాపారస్థుడు దాన్ని ఎలా పెట్టుబడిగా పెట్టాలా అని ఆలోచిస్తాడు. అతనికి ఎలాంటి బలహీనతలు లేకపోతే. ఉంటే, ఆ బలహీనతలకోసం ఖర్చుచేస్తాడు కొంత భాగం.

గురునాథ్‌కున్న బలహీనత ఆల్కహాల్. తన ముప్ఫయవ ఏట కంపెనీ కోసం సరదాగా మొదటిసారి డ్రింక్ తీసుకున్న గురునాథ్ క్రమముగా దానికి బానిసైపోయాడు, ఆయనకి జీవితంలో ఎలాంటి కష్టములు లేవు తాగుడికి బానిసై వాటిని మర్చిపోవాలనుకోడానికి.

క్రమంగా రాత్రులేకాక పగలుకూడా డ్రింక్స్ తీసుకోవడం గురునాథ్‌కి అభ్యాసం అయింది. ఓ మగాడు తాగుడికి బానిసైతే అందువల్ల బాధపడే మొదటి వ్యక్తి అతని భార్య,

శివలీలకి క్రమంగా అరమవసాగింది తన భర్తని తన నించి వేరు చేసేది ఆల్కహాల్ అని భర్తని తాగవద్దని మందలించింది బతిమాలింది. ఎన్నివిధాల ప్రయత్నించాలో అన్ని విధాలా ప్రయత్నించింది. గురునాథ్ ఆమె మాటలు ఏ కోశాన పట్టించుకోలేదు. ముందర క్లబ్స్‌లో తాగేవాడు. తన తాగుడు గురించి అందరూ చెడ్డగా చెప్పుకోవడం మొదలు పెట్టడంతో బార్లలో తాగసాగాడు.

అక్కడ తన మిత్రులు తరచు తారస పడుతుండడంతో ఇంటికి మార్చాడు ఇంట్లో భార్యపోరు పడలేక ఓ గెస్టుహౌస్ తీసుకన్నాడు. అందులో వంటవచ్చిన ఓ కేర్‌టేకర్‌ని పెట్టాడు. సాధ్యమయినంత ఎక్కువకాలం అక్కడే గడుపుతూ తాగుతుండేవాడు, వంటవాడు వంట చేయటం, తాగుడుతో కడుపునిండిన గురునాధ్ దాన్ని తినకపోవటం, గెస్టుహౌస్ తీసుకున్న మొదటిరోజునుంచి జరుగుతోంది.

శివలీలకి భర్త దర్శనమే కరువయింది, తన తప్పు తెలుసుకుంది. ఇదివరకు ఇంట్లో తాగుతుంటే భర్తని తిట్టిపోసేది ఎంతో దారుణంగా, పరుషంగా తిట్టేది. మత్తులో వున్న గురునాధ్ ఆ మాటలు విని నవ్వేసే వాడు మామూలు మనిషిగా వింటే భరించలేకపోయేవాడు. ఇంట్లోవాళ్లు శివలీలని మందలించేవాళ్ళు భర్తని ఎందుకు ఆడిపోసుకుంటావని. బాధ పడుతూ చెప్పేది, ఆయన ఆరోగ్యం పాడయిపోతుందని

గెస్టుహౌస్ తీసుకున్న రెండు నెలల తర్వాత శివలీల భర్తతో చెప్పింది. తనే అననని ఇంట్లోనే తీసుకోవచ్చుని అలాగే చేశాడు.

ఈ రెండు నెలలలో ఏం మార్పు వచ్చిందో తెలియదు గురునాధ్ ఇంట్లో డ్రింక్స్ తీసుకున్నప్పుడు ఇదివరలా నిశ్శబ్దంగా వుండటం లేదు కనపడిన వారినందరినీ నోటికొచ్చినట్లు తిట్టసాగాడు దాంతో ఇంటిలో సర్వెంట్స్‌తో సహా ఎవరూ ఆయన ఎదుట పడటంలేదు ఆ సమయంలో.

ఒక్క శివలీల తప్ప.

భార్యని తెగతిట్టేవాడు. ముందర ఇంగ్లీషులో, క్రమంగా తెలుగులో, కొద్దికాలం దాటాక అచ్చతెలుగులో ఇష్టం వచ్చినట్లు బూతులుతిట్టసాగాడు.

శివలీల అన్ని తిట్లు తింటూకూడా ఆయనకి కనుమరుగయ్యేదికాదు. ఆ తిట్లకి ఆవిడ కృంగిపోయేది. కాని భర్తకి దూరం అయ్యే ప్రయత్నం చెయ్యలేదు. అసలు ఆవిడ ఎందుకు విడాకులు తీసుకోలేదో చాలామందికి అర్థం అయ్యేదికాదు. శివలీల తండ్రి ఆ ప్రయత్నం చెయ్యమని నాలుగయిదుసార్లు సలహా ఇచ్చినా శివలీల వప్పుకోలేదు ఉదయం మత్తుతగాక తను అలా అసభ్యంగా, అనాగరికంగా తిట్టినందుకు క్షమాపణ చెప్పుకొనే వాడు. ఎంతో సిగ్గుపడేవాడు. ఇంక తాగననేవాడు. అరగంటకూడా ఆ మాట మీద వుండగలిగేవాడు కాడు మళ్ళీ మామూలే అనవసరంగా క్షమాపణ చెప్పాను. నిన్నింకా తిట్టాలి అనేవాడు శివలీలే వ్యాపార విషయాలు చూసుకోసాగింది.

* * *

నే వెళ్ళేటప్పటికి శిథిలమయిన గురునాధ్ శరీరం ఇంటి ముందు పడుకోబెట్టబడివుంది. ఆయన శవం పక్కనకూర్చున్న శివలీల రోదిస్తున్నది.

నెలదాటినా శివలీల విచారం కించిత్ అయినా తగ్గలేదు. ఓ రోజు వాళ్ళింటికి వెళితే మొదటిరోజు చూసిన విచారం ఇంకా శివలీలలో కన బడింది నాకు ఆశ్చర్యపోయాను.

"పోయిన వాళ్ళంతా మంచివాళ్ళు...." ఓదార్చబోయాను.

"ఆ దేముడు నాకు అన్యాయం చేశాడు. నా మీద ఆయనకెంతో ప్రేమ. ఒక్క తాగుడు తప్ప ఆయనకి మరే చెడ్డ అలవాటులేదు. తాగుడుకి అలవాటుపడ బోయేముందు ఎలా వుండేవాడో ఆలోచిస్తే నా కడుపు తరుక్కుపోతుంది. మీకు తెలుసుగా చాలామంది గెస్టుహౌస్‌లు తీసుకునేది స్త్రీ వ్యసనం వుంటే. కేవలం డ్రింక్సుకోసం ఆయన గెస్టుహౌస్ మెయిన్ టెయిన్ చేశాడంటే ఎంత పిచ్చిమారాజో ఊహించండి. ఆ పిచ్చే వుంటే ఎప్పుడో విడాకులు తీసేసుకునేదాన్ని. ఆరోగ్యం పాడౌతుందని డ్రింక్స్ తగ్గించమనేదాన్ని. ఆయన ఎన్ని తిట్టినా, ఆయనకాదు, ఆయన రక్తంలోని ఆల్కహాల్ అని సరిపెట్టుకొనేదాన్ని. మర్నాడు నన్నలా తిట్టినందుకు ఎంతో సిగ్గుపడేవారు. కనీసం వక్కపొడి కూడా వేసుకోరు. ప్రతి రాత్రి కనిపిస్తుంది ఆయనలేని లోపం. తిట్లు తినికాని పడుకునేదాన్ని కాదు. ఇప్పుడేవీ ఆ తిట్లు? ఇప్పుడెవరున్నారు నన్ను తిట్టటానికి...."

శివలీల భోరున ఏడుస్తుంటే ఎవరో నా మనసు పిండినట్లుంది. శివలీల సరయిన భార్య అని కూడా అనిపించింది.

## టు - వే - టికెట్

చిత్రగుప్తుడు తన భూతద్దాల కళ్ళజోడులోంచి జాగ్రత్తగా చూస్తూ తన చిట్టాని తిరగేసి కైలాసం పాప పుణ్యాల పట్టికని వెదికి పట్టుకున్నాడు. హైద్రాబాద్‌లో ఆటో డ్రయివర్ అని తెగియగానే యమభటులని ఆజ్ఞాపించాడు.

"వీడిని రోడ్డురోలర్ క్రింద వందసంవత్సరములపాటు సాఫీ చెయ్యండి."